వసతులు లేవని బడిని మార్చేశారు..



2



2

పోచంపాడ్‌లో కత్తిపోట్లు

AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

## భీమేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** తాడ్వాయి మండలంలోని సంతాయి పేట్ గ్రామంలో భీమేశ్వర స్వామి ఆలయాన్ని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ప్రకృతిఒడిలో ఉన్న భీమేశ్వరాలయానికి ఎన్నో ప్రత్యేకతలున్నాయని.. ఆలయ అభివృద్ధి కోసం రూ.1.80 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన భీమేశ్వర స్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసి, భక్తులకు మరింత సౌకర్యాలు కల్పించడం తన లక్ష్యమని తెలిపారు.



# బిల్డర్ నుంచి డబ్బులు డిమాండ్

- కార్పొరేటర్‌పై కేసు నమోదు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని ఓ బీజేపీ కార్పొరేటర్‌పై కేసు నమోదైంది. నగరంలోని లలితానగర్‌కు చెందిన బిల్డర్ గడ్డం ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక బీజేపీ కార్పొరేటర్ మఠం పవన్‌పై ఐదో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ నం. 62/2026, బీఎన్ఎస్ సెక్షన్ 308(1) కింద కేసు నమోదు చేస్తూ ఈ నెల 6న ఎఫ్ఐఆర్ జారీ అయ్యింది. ఎఫ్ఐఆర్‌లో పొందుపర్చిన వివరాల ప్రకారం.. ఫిర్యాదుదారు గడ్డం ప్రసాద్ గత ఏడు సంవత్సరాలు బిల్డర్‌గా పనిచేస్తున్నాడు. ప్రస్తుతం అయోధ్యనగర్‌లో వంద గజాల స్థలంలో ఓ ఇంటిని నిర్మిస్తున్నాడు. కాగా.. సంబంధిత ఇల్లు నిర్మాణానికి సంబంధించి మున్సిపల్ కార్పొరేషన్ నుంచి అన్ని రకాల అనుమతులు తీసుకున్నప్పటికీ స్థానిక కార్పొరేటర్ మఠం పవన్, అతని అనుచరుడు వినోద్ 15 రోజుల క్రితం తనను డబ్బులు డిమాండ్ చేసినట్లు బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. డబ్బులు ఇవ్వకపోతే ఇంటి పనులు నిలిపివేయిస్తామని బెదిరించినట్లు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపాడు. దీంతో విచారణ జరిపిన ఐదో టౌన్ పోలీసులు మఠం పవన్‌తో పాటు అతని అనుచరుడు వినోద్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిజామాబాద్ నగర పాలక సంస్థ పాలకవర్గం ఇటీవలే కొలువుదీరిన విషయం తెలిసిందే. తొలి సమావేశం జరిగి కూడా నెల రోజులు కాలేదు. అప్పుడే కార్పొరేటర్ల వసూళ్ల పర్వం మొదలైంది. ఈ క్రమంలో తాజాగా బీజేపీ కార్పొరేటర్‌పై కేసు నమోదు కావడం నగరంలో తీవ్ర చర్చకు దారితీసింది. దీనిపై బీజేపీ నేతలు ఎలా స్పందిస్తుందో చూడాలి.

## కుట్రతో నాపై కేసు పెట్టారు..

### కార్పొరేటర్ మఠం పవన్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కుట్రతోనే నాపై తప్పుడు కేసు బనాయించారని 8వ డివిజన్ బీజేపీ కార్పొరేషన్ మఠం పవన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం వీడియో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను బిల్డర్ల దగ్గర డబ్బులు వసూలు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోందన్నారు. ఆ ప్రచారానికి తనకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఏ బిల్డర్ దగ్గర తాను డబ్బులు వసూలు చేయలేదన్నారు. కావాలనే కుట్రపన్ని తనపై కేసు బనాయించారని ఆయన పేర్కొన్నారు. బిల్డర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జిల్లాల రమేశ్, మాజీ కార్పొరేటర్ సదానంద్, మరో వ్యక్తి కలిసి తనపై తప్పుడు కేసు పెట్టారని ఆరోపించారు. ఈ విషయమై 5వ టౌన్ ఎస్సై తనకు కనీస సమాచారం ఇవ్వకుండానే కేసు నమోదు చేయడం ఎంతవరకు సమంజమన్నారు. న్యాల్‌కల్ రోడ్‌లోని మున్సిపల్ స్థలాన్ని బిల్డర్ అసోసియేషన్‌లోని కొందరు, కాంగ్రెస్ లీడర్లు కబ్జా చేశారని.. ఈ విషయాన్ని మున్సిపల్ అధికారులకు గతంలోనే ఫిర్యాదు చేశానన్నారు. ఈ విషయంపై కక్షకట్టిన సదరు వ్యక్తులు తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ కేసు పెట్టారని చెప్పారు.

# మహిళా పెట్రో బంకులు

- జిల్లాలో ఏర్పాటుకు సన్నాహాలు
- స్థల పరిశీలన పూర్తి..
- మహిళా సమాఖ్యల చేతికి నిర్వహణ బాధ్యతలు



**వ్యాపార రంగంలోనూ మహిళలు సత్తా చాటేలా ప్రభుత్వం వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టింది. 'ఇందిరా మహిళా శక్తి' పథకం కింద జిల్లాలోని మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనుంది. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో విజయవంతంగా నడుస్తున్న ఈ నమూనాను, ఇప్పుడు నిజామాబాద్ జిల్లాలోనూ అమలు చేయనున్నారు.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

సాధారణంగా పెట్రోల్ బంకుల నిర్వహణ అంటే పురుషుల ఆధిపత్యం కనిపిస్తుంది. కానీ, ఇకపై ఆ దృశ్యం మారనుంది. యాజమానులు, మేనేజర్లు, ఆపరేటర్లు.. ఇలా అందరూ మహిళలే ఉండి పెట్రోల్ బంకులను నడపనున్నారు. జిల్లాలోని పొదుపు సంఘాల మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం.

### రాష్ట్రంలో 40 బంకులు

రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేయనున్న 40 పెట్రోల్ బంకుల్లో నిజామాబాద్ జిల్లాకు కూడా చోటు దక్కింది. జిల్లాలోని కీలక ప్రాంతాల్లో ఈ బంకుల ఏర్పాటుకు అధికారులు ఇప్పటికే స్థలాలను గుర్తించారు. బంకుల ఏర్పాటుకు అవసరమైన భూములను గుర్తించి, వాటిని మహిళా సమాఖ్యలకు అప్పగించే ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అధికారులు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, భారత్ పెట్రోలియం వంటి సంస్థలతో సమన్వయం చేసుకుని సాంకేతిక సహకారం అందించనున్నారు.

### ఆర్థిక స్వావలంబన దిశగా..

ఈ బంకుల ద్వారా వచ్చే ఆదాయం నేరుగా మహిళా సమాఖ్యలకే చెందుతుంది. దీంతో వందలాది మంది మహిళలకు ఉపాధి దొరకడమే కాకుండా, సంఘాలకు ఆర్థిక పరిపుష్టి చేకూరుతుంది. ఇప్పటికే నారాయణపేట, సంగారెడ్డి జిల్లాల్లో మహిళా సమాఖ్యలు పెట్రోల్ బంకులను లాభసాటిగా నిర్వహిస్తుండటం విశేషం. అదే ఉత్సాహంతో నిజామాబాద్ జిల్లాలోనూ వీటిని ప్రారంభించేందుకు సెర్ప్ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### జూన్ 2 నాటికి ..

రాష్ట్ర అవతరణ దినోత్సవం జూన్ 2 నాటికి జిల్లాలో కనీసం ఒకటైనా నూతన బంకును ప్రారంభించాలని యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది. దీనికోసం ఎంపికైన మహిళా సంఘ సభ్యులకు ప్రత్యేక శిక్షణ కూడా ఇవ్వనున్నారు. కస్టమర్లతో ఎలా వ్యవహరించాలి, స్టాక్ నిర్వహణ, డిజిటల్ చెల్లింపులు వంటి అంశాలపై వీరికి అవగాహన కల్పిస్తారు.

### త్వరలో ప్రారంభిస్తాం



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. నిజామాబాద్ జిల్లాలో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో పెట్రోల్ బంకుల ఏర్పాటుతో వారికి ఉపాధి దొరుకుతుంది. త్వరలోనే పనులు పూర్తి చేసి వీటిని ప్రారంభిస్తాం.

**– సాయాగౌడ్, డీఆర్‌డీవో**



## యుద్ధప్రాతిపదికన విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేయించాలి..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఈదురుగాలులతో కూడిన అకాల వర్షం కారణంతో కూలిపోయిన లైన్లను యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ అన్నారు. ఈ మేరకు సోమవా రం రాత్రి డిచ్‌పల్లి, సారంగపూర్ ప్రాంతాల్లో గాలుల కారణంగా పడిపోయిన 220 కేవీ టవర్లను ఆయన పరిశీలించారు. బాసర వెళ్తూ తిరుగు ప్రయాణంలో భాగంగా సీఎండీ జిల్లా లోని పలు ప్రాంతాల్లో ఈదురుగాలుల కారణంగా కూలిపోయిన టవర్లను పరిశీలించారు. సీఎండీ వెంట ట్రాన్స్‌కో ట్రాన్స్‌మిషన్ డైరెక్టర్ సంపత్‌రావు, సీఈ విజయ్ కుమార్, పాపారావు, ఎస్‌సీ పీవీరావు, డీఈలు, ఏఈడీలు ఉన్నారు.



## జంతువుల దాహార్తి తీర్చేందుకు అటవీశాఖ చర్యలు

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** వేసవి దృష్ట్యా అడవుల్లో జంతువుల దాహార్తిని తీర్చేందుకు అటవీశాఖ చర్యలు చేపట్టింది. ఈ సందర్భంగా దట్టమైన అడవుల్లో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్లలో శాఖ ఆధ్వర్యంలో నీటిని నింపుతున్నారు. తద్వారా జంతువులు దాహార్తితో రోడ్లపైకి, గ్రామాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆర్మూర్ రేంజ్ పరిధిలోని కల్లెడ ఎఫ్‌బీవో సుశీల్‌కుమార్ కల్లెడ బీట్‌లో సాసర్‌పిట్లలో నీటిని నింపారు.

## పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై కూడా శ్రద్ధ పెట్టాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నిత్యం పనిఒత్తిడిలో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యంపై కూడా శ్రద్ధ చూపాలని సీపీ సాయిచైతన్య అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా మనోరమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఉచిత మెగా ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి సీపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. పనిఒత్తిడిలోనూ సిబ్బంది వైద్యుల సూచనలు సలహాలు పాటించాలన్నారు. ఆరోగ్యం బాగున్నప్పుడే విధి నిర్వహణకు తమ శరీరం సహకరిస్తుందని కావున ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. సిబ్బంది ఎల్లప్పుడూ మందులు వాడే బదులు ముందస్తు జాగ్రత్తలు పాటించినట్లయితే ఆరోగ్యానికి ఎలాంటి హాని కలుగకుండా ఉంటుందని తెలిపారు. మన శరీరానికి ఏ ఆహారం తింటే జీర్ణం అవుతుందో అదే ఆహారాన్ని తీసుకోవాలని అంతేకానీ జీర్ణం కానీ ఆహారం తీసుకొని బాధపడకూడదన్నారు. అనంతరం సీపీ సాయిచైతన్య, మేయర్ ఉమారాణితో కలిసి క్యాంప్‌ను ప్రారంభించారు. క్యాంప్‌లో పోలీస్ సిబ్బంది, మున్సిపల్ కార్మికులకు ఉచితంగా వైద్యం, అన్నిరకాల పరీక్షలు నిర్వహించి వారికి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అదనపు పోలీస్ కమి



షనర్ (అడ్మిన్) జి.బస్వారెడ్డి, ఏసీపీ ప్రకాశ్, ఐఎంఏ రాష్ట్ర ప్రెసిడెంట్ కిషన్ పురంధాల, ఐఎంఏ జనరల్ సెక్రెటరీ అశోక్, నేషనల్ ఐఎంఏ యాక్షన్ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు విశాల్, మనోరమ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నరసింహ కట్ట తదితరులు పాల్గొన్నారు.

## టీహబ్ భవనంలో సీటీ స్కాన్ ఏర్పాటు: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**అక్షరటుడే, కామారెడ్డి:** సీటీ స్కాన్ యంత్రాన్ని టీ హబ్ భవనంలో ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ వైద్యాధికారులకు సూచించారు. జీజీహెచ్ డెవలప్ మెంట్ సొసైటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఇప్ప ఉమారాణి, ఇతర అధికారులు పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ఆస్పత్రిలో చేపట్టిన పనుల్లో సుమారు 99శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. హెచ్‌డీఎస్ నిధుల ఆర్థిక స్థితిపై వివరాలు అందించారు. సుమారు రూ.18లక్షలు అందుబాటులో ఉండగా అందులో రూ.10 లక్షలు క్యాన్సర్ కేర్, పాలియేటివ్ సేవలకు కేటాయించగా, రూ.2 లక్షలు హాస్పిటల్ క్యాంటీన్ కాషన్ డిపాజిట్‌గా వినియోగించినట్లు తెలిపారు. మిగిలిన నిధులను పెండింగ్ పనుల కోసం పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ శాఖ ద్వారా వినియోగించనున్నట్లు వివరించారు. కేసీఆర్ కిట్ అమలు తర్వాత ప్రసూతి కేసుల పెరుగుదలపై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వివరాలు కోరడంతో పాటు ట్రామా కేసుల వివరాలను ఇవ్వాలని సూచించారు. హాస్పిటల్‌లో సీటీ స్కాన్ సౌకర్యం లేకపోవడం వల్ల ట్రామా రోగులను ఇతర ఆస్పత్రులకు తరలించాల్సి వస్తోందని, ప్రస్తుత టీహబ్ భవనంలో సీటీ స్కాన్ యంత్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యుడు రాజన్న సింగిల్ డోనర్ ప్లేట్లెట్స్ అందుబాటులో లేని విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. యంత్రం ఉన్నప్పటికీ ప్రతి యూనిట్‌కు సుమారు రూ.8వేలు వ్యయం అవుతుందని తెలపగా, దీనిపై ఇండెంట్ పంపించాలని, అవసరమైన సహాయం అందిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జీజీహెచ్‌ను కొత్త భవనానికి మార్చే విషయమై కలెక్టర్, ఎమ్మెల్యే చర్చించారు. మెడికల్ కాలేజ్ భవనం జూన్ నాటికి పూర్తయ్యే అవకాశముందని, కాలేజ్ అక్కడికి మారిన అనంతరం ప్రస్తుత ఎంసీహెచ్ భవనాన్ని ఆస్పత్రి కోసం వినియోగంలోకి తీసుకురావాలని నిర్ణయించారు. ఈ ప్రక్రియ పర్యవేక్షణ కోసం



టీఎస్ఎంఐడీసీ, ఆర్అండ్‌బీ ఇంజినీర్లు, ఆస్పత్రి సూపరింటెండెంట్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్, అదనపు కలెక్టర్, జిల్లావైద్యాధికారి, ఆర్డీవో, ఆర్ఎంవోలతో కమిటీ ఏర్పాటు చేశారు. ఆస్పత్రికి ఒక వెంటిలేటర్ అందజేస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ తరపున రాజన్న తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అందుబాటులో ఉన్న వనరులను సమర్థవంతంగా వినియోగిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా అత్యవసర సేవల విభాగాన్ని బలోపేతం చేయడం, అవసరమైన వైద్య పరికరాలను సమకూర్చడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వాల్యా, ఆర్డీవో ఎన్ వై గిరి, అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌ను ముట్టడించిన రైతులు..

### పంట నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్..



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఈదురుగాలులతో కూడిన వడగండ్ల వాన కారణంగా నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని కలెక్టరేట్‌ను ముట్టడించారు. రైతులకు మద్దతు తెలుపుతూ ముట్టడి కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి మాట్లాడుతూ జిల్లాలో వడగండ్ల వర్షం కారణంగా వందల ఎకరాల్లో మొక్కజొన్న, వరి, జొన్న పంటలు నష్టపోయాయన్నారు. కానీ ఇప్పటివరకు అధికారులు ఈ పరిస్థితిపై స్పందించకపోవడం విచారకరమన్నారు. నష్టపోయిన పంటల వివరాలు సేకరించి ప్రభుత్వానికి పంపాల్సిన బాధ్యత ఉన్న అధికారులు గ్రామాలను సందర్శించకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు లెక్కలు వేసి ప్రభుత్వానికి నివేదించాలని రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బోధన్ నియోజకవర్గంలోని సాలూర, ఖాజాపూర్, నాగేశ్వర్, రూరల్ నియోజకవర్గం నుంచి డిచ్‌పల్లి, సుద్దపల్లికి చెందిన సుమారు 100 మంది రైతులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు వారు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారు గేటు ఎదుట బైఠాయించారు.



## బెల్టు షాపు నిర్వహణ పుకార్లకు చెక్..

**అక్షరటుడే, కామారెడ్డి:** రెండు రోజుల క్రితం కామారెడ్డి మండలం రాఘవాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో బెల్ట్ షాప్ నిర్వహణకు టెండర్ వేశారన్న ప్రచారం సాగింది. అయితే ఆ ప్రచారం వట్టిదేనని గ్రామస్థులు నిరూపించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం గ్రామస్థులంతా కలిసి సర్పంచ్ ఎడ్ల వినీల నరేష్ ఆధ్వర్యంలో మద్యపాన నిషేధంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో భాగంగా గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయాన్ని నిషేధిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించారు. తీర్మానాన్ని వ్యతిరేకించి ఎవరైనా మద్యం విక్రయాలు జరిపితే రూ.50వేలు జరిమానా విధిస్తామని, మద్యం సేవించిన వారికి రూ.10వేలు జరిమానా విధిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వినీల నరేష్ మాట్లాడుతూ.. యువత చెడుమార్గం వైపు వెళ్లకుండా తీర్మానం చేయడం జరిగిందని పేర్కొన్నారు. సమావేశంలో ఉప సర్పంచ్ గుగ్లోత్ నరేష్, వార్డు మెంబర్లు గుగ్లోత్ సుజాత, కిషన్, గుగ్లోత్ వసంత, గ్రామ సంఘం అధ్యక్షురాలు మంద లక్ష్మి, గ్రామస్థులు సిద్దయ్య, ఈర్యా నాయక్, భాష, లక్ష్మణ్, రామాగౌడ్, స్వామి, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఏడాదైనా పారితోషికం ఇవ్వరా..: ఉపాధ్యాయ సంఘాల జేఏసీ




**అక్షరటుడే, కామారెడ్డి:** పదోతరగతి మూల్యాంకనం చేసి ఏడాది పూర్తయిందని, కులగణన చేపట్టి ఏడాదిన్నర కావస్తున్నా పారితోషికం ఇంకా ఇవ్వకపోవడం సరికాదని ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆవేదన వ్యక్తం చేసింది. జిల్లా కేంద్రంలోని పదోతరగతి స్పాట్ కేంద్రం వద్ద ఉపాధ్యాయ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో భోజన విరామం సమయంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీటీజేఏసీ జిల్లా ఛైర్మన్ అల్లాపూర్ కుశాల్, యూఎస్పీసీ జిల్లా ఛైర్మన్ ఆకుల బాబు, జాక్టో జిల్లా ఛైర్మన్ సయ్యద్ ఖలీముద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతల లింగం, టీఆర్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బషీర్, ఎస్టీయూటీఎస్ జిల్లా నాయకులు పంపరి ప్రవీణ్ కుమార్, డీటీఎఫ్ ప్రభాకర్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు యాదయ్య, ఇతర సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

## డ్రంకన్‌డ్రైవ్‌లో ఒకరికి జైలుశిక్ష

**అక్షరటుడే, ఆర్మూర్:** డ్రంకన్ డ్రైవ్ తనిఖీ పట్టుబడ్డ వ్యక్తుల్లో ఒకరికి న్యాయస్థానం జైలుశిక్ష విధించిందని ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ పేర్కొన్నారు. పట్టణంలో స్పెషల్ డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించగా మద్యం తాగి వాహనాలు నడుపుతూ ఏడుగురు పట్టుబడ్డట్లు ఆయన తెలిపారు. వారిని ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి రూ.10వేల చొప్పున జరిమానా విధించారని.. ఒకరికి నాలుగురోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందన్నారు.

## ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఒకరి మృతి

**అక్షరటుడే, ఆర్మూర్:** ప్రమాదవశాత్తు నీటికుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఆర్మూర్ ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గోవింద్ పేటకు చెందిన ప్రవీణ్(33) హను మాన్ గుడి వెనక ఉన్న కుంట దగ్గరకు బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి నీటికుంటలోపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

**జిల్లాలో విద్యాశాఖ నిర్లక్ష్యానికి ఇదొక మచ్చుతునకగా చెప్పవచ్చు. గురుకుల పాఠశాల ఓ మండలానికి మంజూరైతే వసతులు లేవనే సాకు చూపించి కొందరు అధికారులు, సిబ్బంది సొంత ప్రయోజనాల కోసం ఏకంగా జిల్లా కేంద్రంలోని అద్దెభవనంలో పాఠశాలను కొనసాగిస్తున్నారు. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు ఇబ్బందులు ఏర్పడుతున్నా పట్టించుకోవట్లేదు. ఇలా ఓ పాఠశాల స్థానమార్పిడి జరిగినా సంబంధిత విద్యాశాఖ పట్టించుకోకపోవడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.** – అక్షరటుడే, లింగంపేట




# వసతులు లేవని బడిని మార్చేశారు..

- లింగంపేటకు మంజూరైన గురుకుల పాఠశాల దేవునిపల్లిలో కొనసాగింపు
- అవస్థలు పడుతున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు
- ఈ ఏడాదైనా లింగంపేటకు తరలించాలని విన్నపాలు

లింగంపేటలో వసతులు, భవనాలు లేవని మండల కేంద్రానికి మంజూరైన సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలను దేవునిపల్లిలోని ఓ కుల సంఘం భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకు సుమారు 500 మంది విద్యార్థినులు చదువుకుంటున్నారు.

### పాఠశాల పేరు లేని భవనం..

దేవునిపల్లిలో నిర్వహిస్తున్న గురుకులానికి పాఠశాల పేరుతో కూడిన బోర్డు కూడా అధికారులు ఏర్పాటు చేయకపోవడం వారి నిర్లక్ష్యానికి నిదర్శనంగా తల్లిదండ్రులు చెబుతున్నారు. కొత్తగా అడ్మిషన్ల కోసం వచ్చే విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ఎక్కడుందోనని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఉందని వారంటున్నారు. పాఠశాల ముందర చిన్న బోర్డు చూసి గురుకుల పాఠశాలని కనుక్కోవాల్సిన పరిస్థితి ఉందని వారంటున్నారు. లింగంపేటలో వసతులు లేవనే సాకు చూపి పాఠశాలను జిల్లా కేంద్రంలో నెలకొల్పడం ఎంతవరకు సమంజసమని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు.

### కన్నెత్తి చూడని అధికారులు

దేవునిపల్లిలోని ప్రధాన రహదారి పక్కనే ఈ పాఠశాల కొనసాగుతున్న ఈ పాఠశాలలో విద్యార్థులకు కనీస వస్తువులు లేవని, క్రీడా ప్రాంగణం లేదని విద్యార్థులు తల్లిదండ్రులు వాపోతున్నారు. ఈ విషయాలు ఉన్నత అధికారులకు తెలిసినప్పటికీ కన్నెత్తి చూడడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ ఏడాదైనా పాఠశాల లింగంపేటకు తరలించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, నాయకులు కోరుతున్నారు.

### లింగంపేటకు తరలించాలి



లింగంపేటకు మంజూరైన సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను దేవునిపల్లిలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలను లింగంపేటకు తరలించాలని గతంలో జిల్లా పాలనాధికారికి వినతి పత్రం అందజేశా. అయినా ఇప్పటివరకు స్పందించలేదు. వచ్చే విద్యా సంవత్సరం అయినా ఈ పాఠశాల తరగతులు లింగంపేటలో నిర్వహించాలి. – ముదాం సాయిలు, మాజీ ఎంపీపీ

## తెలంగాణ గురుకుల విద్యాలయంలో అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం



**అక్షరటుడే, మెండోరా:** తెలంగాణ గురుకుల విద్యాలయంలో టీజీఆర్‌జేసీ సెట్ 2026లో భాగంగా అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పోచంపాడ్ టీజీఆర్ఎస్ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. 2026-27 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్ ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌లలో ప్రవేశాల కోసం మే 30న పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని.. మార్చి 16వ తేదీ నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. ఈనెల 15లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫీజు రూ.200గా నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ ఈ పరీక్షకు అర్హులని, ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. గురుకుల విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

## అధైర్య పడొద్దు.. కొడుకులా అండగా ఉంటా:

### 'అక్షరటుడే' కథనానికి స్పందించిన సైన్యసేన అధ్యక్షుడు



**అక్షరటుడే, కామారెడ్డి:** కన్నబిడ్డలు తమ తల్లిదండ్రులను వృద్ధాప్యంలో పట్టించుకోకపోవడంపై 'అక్షరటుడే' లో సోమవారం 'కన్నోళ్లకు కన్నీళ్లే..' శీర్షికతో ప్రచురితమైన కథనం పలువురిని కలిచివేస్తోంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను దూరం చేసే కొడుకులకు కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. కామారెడ్డి జిల్లా లో సైన్యసేన సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్న ఎర్రోళ్ల నరేష్ 'అక్షరటుడే' కథనంపై స్పందించారు. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన తల్లిదండ్రులను పలువురు నిర్లక్ష్యం చేయడంపై ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమను కన్నందుకు వారి రుణం తీర్చుకోవాల్సింది పోయి.. వారిని అనాథలుగా మార్చడం సరికాదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఎర్రోళ్ల నరేష్ మాట్లాడుతూ.. వృద్ధులు బాధపడవద్దని.. తాను కన్నకొడుకులా చూసుకుంటానని భరోసా కల్పించారు. తనకు సమాచారమిస్తే వారిని అక్కున చేర్చుకుంటానని తెలిపారు. కొడుకును కాకపోయినా కన్న కొడుకులా చూసుకుంటానని హామీ ఇచ్చారు. నిత్యావసర వస్తువులు అందజేస్తానని.. వృద్ధాప్యంలో ఉన్నవారి అవసరాలు సంస్థ ద్వారా తీరుస్తానని తెలిపారు. 9912890421కు ఫోన్‌చేస్తే క్షణాల్లో సాయం చేయడానికి మీ ముందుంటామని చెప్పారు.

## ఏడోవార్డులో విద్యుత్ స్తంభాల ఏర్పాటు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. కొన్నాళ్లుగా వార్డులో విద్యుత్ సమస్య ఉందని.. స్తంభాలు ఏర్పాటు చేయాలని కాలనీవాసుల గతంలో ఎమ్మెల్యే మదన్ మోహన్, మున్సిపల్ వైస్ ఛైర్మన్ భాగ్యవతి, కాంగ్రెస్ యువనాయకుడు ప్రశాంత్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన వారు వార్డుల్లో స్తంభాల సమస్యను పరిష్కరించాలని ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశించారు. దీంతో మంగళవారం వార్డులో విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసి వైరింగ్ అమర్చారు. ఈ సందర్భంగా కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

## సమ్మక్క, సారమ్మలకు పూజలు




**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** జిల్లాలోని ఎల్లారెడ్డి మండలంలోని అన్నాసాగర్ గ్రామంలో దక్షిణ మేడారంగా కొలువైన సమ్మక్క సారలమ్మలను సర్పంచ్ స్రవంతి సాయగౌడ్, ఉపసర్పంచ్ నాగరాజు తదితరులు దర్శించుకున్నారు. ఓడిబియ్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని.. పాడిపంటలు బాగా పండాలని మొక్కులు తీర్చుకున్నారు. అమ్మవార్లను దర్శించుకున్న వారిలో సమ్మక్క కళా బృందం, గ్రామ పెద్దలు, మాజీ సర్పంచ్‌లు పెదగొల్ల దుర్గయ్య, నాగమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పర్వయ్య, యువకులు నరేష్, నాగరాజు, వంశీ పాల్గొన్నారు.

## ఆడపిల్లల భద్రతే షీటీం బాధ్యత..



**అక్షటుడే,పెద్ద కొడప్‌గల్:** ఆడపిల్లల భద్రతే షీటీం బాధ్యత అని బాన్సువాడ షీటీం ఇన్‌ఛార్జి పార్వతి అన్నారు. మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్‌తో కలిసి మండలంలోని కాటేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాలు, ఎస్సై అరుణ్‌కుమార్ సూచనల మేరకు పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు బాలికల భద్రతే షీటీమ్స్ లక్ష్యమన్నారు. ఎవరైనా ఇబ్బంది కలిగితే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, 181కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పోలీస్ కళాబృందం ఇన్‌ఛార్జి హెడ్ కానిస్టేబుల్ తిరుపతి, శేషారావు, ప్రభాకర్, సాయిలు, వాసవి, అనిల్ కుమార్, మండల విద్యాధికారి ప్రవీణ్ కుమార్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పోచంపాడ్‌లో కత్తిపోట్ల కలకలం.. యువకుడి మృతి



**అక్షరటుడే, మెండోరా:** మెండోరా మండలం పోచంపాడ్ గ్రామంలో కత్తిపోట్ల ఘటన కలకలం రేపింది. పాత వివాదాల నేపథ్యంలో జరిగిన ఘర్షణలో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపాడ్‌కు చెందిన రిషిక్, నర్సింలు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇరు వర్గాల మధ్య మళ్లీ వివాదం చెలరేగింది. దీంతో సమస్యను మాట్లాడుకుని పరిష్కరించుకోవడానికి నర్సింలు ఇంటి వద్దకు రిషిక్ వెళ్లగా ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో రిషిక్‌పై నర్సింలు కత్తితో దాడి చేశాడు. అతనికి కడుపులో తీవ్ర గాయమైంది. వెంటనే బాధితుడిని నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుహాసిని తెలిపారు.

## కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకట రామిరెడ్డి సూచించారు. ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర ప్రకారం గ్రేడ్-1 వరికి క్వింటాలుకు రూ.2,389, సాధారణ రకం వరికి క్వింటాలు రూ.2,369కు కొనుగోలు చేయనున్నట్లు ఆర్డీవో తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత, వేగం కోసం ప్యాక్స్, ఇతర సంబంధిత సిబ్బందికి ప్రొక్యూర్మెంట్ యాప్ వినియోగించాలన్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా కొనుగోలు కేంద్రాల్లో తగిన సదుపాయాలు కల్పించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ఏర్పాట్లు సమర్థవంతంగా ఉండేలా చూడాలన్నారు. ఎండాకాలం దృష్ట్యా కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పద్మ శ్రీకాంత్, తహశీల్దార్ ప్రేమ్ కుమార్, కౌన్సిలర్స్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పామాయిల్ పంటపై రైతులకు అవగాహన



**అక్షరటుడే, ఆర్మూర్:** ఆలూర్ మండలం దేగాం గ్రామంలో ఉన్న రైతు వేదికలో పామాయిల్ (ఆయిల్ పామ్) పంటపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు విజయలక్ష్మి, మండల వ్యవసాయ అధికారి రాంబాబు, సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు విజయలక్ష్మి మాట్లాడుతూ.. రైతులు సాంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటల వైపు మళ్లితే మంచి లాభాలు పొందవచ్చన్నారు. ప్రభుత్వం ఆయిల్ పామ్ పంటను ప్రోత్సహిస్తూ పలు రకాల సబ్సిడీలు అందిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి రాంబాబు మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ పంటకు ప్రభుత్వం మొక్కలను ఒక్కటి రూ.20 చొప్పున సబ్సిడీపై అందిస్తోందని.. ఒక ఎకరానికి అంతర పంట సాగుకు ఏడాదికి రూ.4,200 చెల్లించబడుతుందన్నారు. డ్రిప్ సదుపాయం ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం, ఇతరులకు 90 శాతం సబ్సిడీతో అందిస్తున్నారన్నారు. గ్రామ సర్పంచ్ ఇట్టెడి లింగారెడ్డి మాట్లాడుతూ రైతులు అధిక ఆదాయం ఇచ్చే పామాయిల్ వంటి వాణిజ్య పంటల సాగును ప్రోత్సహించాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలను వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గంగాధర్, ఏఈవో వసుధ, రమ్య, రైతులు పాల్గొన్నారు.